సాక్షి
తిరుపతి

బుధవారం । 7 । మే । 2025

జాతర మొదలైందహో!

'ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది.. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొనసాగుతుంది.. గనుక నగరవాసులెవ్వరూ ఊరువదలి వెళ్లరాదు.. ఇంతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయరాదు. అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో...' అంటూ కైకాల వంశస్థలు తిరుపతి గంగజాతర చాటింపును వేశారు.

- అర్ధరాత్రి నగర పొలిమేరల్లో కైకాల చాటింపు
- ప్రత్యేక అలంకరణలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లి దర్శనం



విశేష అలంకరణలో గంగమ్మతల్లి



కొడిస్తంభానికి ఒడిబాల

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జాతర సందడి నెలకొంది. గ్రామదేవత తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద కోలాహలం ఏర్పడింది. భేరివీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి డప్పు కొట్టి అష్ట దిగ్బంధన చేసి చాటింపు చేశారు. ఆ చాటింపుతో జాతర ఆరంభమైంది.



గంగమ్మతల్లికి విశేష అభిషేకాలు

ఒడిబాల సమర్పణ

తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగ జాతర బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జరగనుంది. మంగళవారం అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అభిషేకం, పూజలు చేసి ఒడిబాల సమర్పించారు. అమ్మవారు వజ్రకిరీటం, బంగారు ముఖ కవచం ధరించి భక్తులను అనుగ్రహించారు. పలువురు భక్తులు వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పసుపు, కుంకుమ తీసుకొచ్చి కొడిస్తంభం వద్ద పూజలకు సమర్పించారు.

గంగమ్మకు పుట్టింటి సారె

జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి మంగళవారం రాత్రి సంప్రదాయబద్ధంగా పుట్టింటి సారె తీసుకొచ్చారు. అవిలాలలోని పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి ఇంటి నుంచి ఆడపడుచుకు సంప్రదాయబద్ధంగా అందించే పుట్టింటి సారెను అవిలాల పొలిమేరలో వెలసిన గంగమ్మ గుడి వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారి సారెను అందుకునేందుకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈవో, సిబ్బంది, జాతరలో వంశపారంపర్యంగా కీలపాత్ర పోషిస్తున్న కై కాల వంశీయులు అవిలాల పొలిమేరలోని గంగమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడి నుంచి అమ్మవారికి సారెను అందుకుకొని ఊరేగింపుగా శ్రీతాతయ్య గంగమ్మ ఆలయానికి విచ్చేశారు. ఆలయ అర్చకుడు మురళీస్వామి, కైకాల కులస్థులు, అవిలాల గ్రామపెద్దలు పెద్దిరెడ్డి, సురేష్, లోకేష్, చెంగల్‌రాయులు, వెంకటేష్ పిళ్లై తనూజ్ పాల్గొన్నారు.



ఊరేగింపుగా తీసుకొస్తున్న అవిలాల వాసులు



పసుపు, కుంకుమ తీసుకొస్తున్న ఎమ్మెల్యే ఆరణి

న్యూస్‌రీల్

కేరళ తరహాలో టూరిజం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంటీ కృష్ణబాబు

తిరుపతి అర్బన్: కేరళ రాష్ట్రం తరహాలో తిరుపతి జిల్లాలో టూరిజం విభాగం అభివృద్ధి చెందేలా కృషి చేయాల్సిన అవసరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ, ఇన్‌చార్జి జోనల్ ఆఫీసర్ ఎంటీ కృష్ణబాబు తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి నగర కమిషనర్ నారపురెడ్డి మౌర్యతోపాటు పలు విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. తిరుపతి నగరానికి నిత్యం టూరిస్టుల తాకిడి నెలకొంటోందని, ఈ నేపథ్యంలో ఆ రంగాన్ని మరింత అభివృద్ధి చే యాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో తిరుపతి జిల్లా 3వ స్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

గూడబాతుకు వడదెబ్బ



గూడబాతును పరిశీలిస్తున్న వెటర్నరీ వైద్యులు, అటవీశాఖ అధికారులు

సూళ్లూరుపేట రూరల్: గూడ బాతు వడదెబ్బ బారినపడింది. ఎగురుకుంటూ వచ్చి సూళ్లూరుపేట మండలం, టోల్‌ప్లాజా సమీపంలోని ఓ ఇంటిపై సొమ్మసిల్లి పడిపోయింది. గుర్తించిన స్థానికులు సోమవారం అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. డీఎఫ్ఓ హారిక సిబ్బందితో అక్కడకు చేరుకుని గూడ బాతును పరిశీలించారు. వెంటనే పెలికాన్ పక్షిని సూళ్లూరుపేటలో ఉన్న వెటర్నరీ వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు. వడ దెబ్బతగిలిందని అధికారులు గుర్తించారు. చికిత్స అనంతరం గూడబాతును పులికాట్ సమీపంలోని కుదిరి చెరువులో వదిలిపెట్టారు. ప్రాణాపాయం లేదని పేర్కొన్నారు.

షార్‌లో భద్రతా సమావేశం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగకేంద్రమైన సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో మంగళవారం భద్రతా సమావేశాన్ని నిర్వహించారు. భారత్–పాక్ యుద్ధ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని షార్ కేంద్రానికి భద్రతను మరింత పటిష్టం చేశారు. తీర ప్రాంతంలో గస్తీని ముమ్మరం చేశారు. ఈ సమావేశంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజీవ్‌కుమార్, కోస్టల్ డిపార్ట్ మెంట్ అధికారులు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● పరిణయోత్సవం..భక్తజన పరవశం





తిరుమలలో మంగళవారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మలయప్పస్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించగా ఉభయనాంచారులు పల్లకీపై పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమలయప్ప స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. – తిరుమల

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,095 మంది స్వామివారిని దర్శించుకోగా 26,912 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పోలీసు వలయంలో సైదాపురం



సైదాపురం పోలీస్ స్టేషన్ వద్ద ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు వాహనాలు

సైదాపురం: మండల కేంద్రానికి సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న శ్రీనివాస పద్మావతి గని వద్ద మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ నిరసన వ్యక్తం చేయనున్నట్టు సమాచారం అందడంతో ఆత్మకూరు డీఎస్పీ అలెర్ట్ అయ్యారు. ఆయన పర్యవేక్షణలో సుమారు 100 మంది వరకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో సైదాపురంలో ఉత్కంఠ నెలకొంది. సైదాపురం నుంచి శ్రీనివాస పద్మావతి గని వరకు అడుగుకో పోలీసును నియమించారు. ఇందులో మహిళా సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తీరా మాజీ మంత్రి రావడం లేదని సమాచారం అందడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

మెరుగైన వైద్యం అందించండి

తిరుపతి రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జ్ అధికారి ఎంటీ.కృష్ణబాబు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లి, రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి విలేజ్ క్లినిక్‌లను వారు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విలేజ్ క్లినిక్‌కు వచ్చే పేషెంట్ల వివరాలు, అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా విలేజ్ క్లినిక్‌లు పనిచేయాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ ఇవ్వాలని తెలిపారు. నాన్ కమ్యూనికేషన్ రోగాలపై చేస్తున్న ఎన్‌సీడీ సర్వే ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ సర్వే ద్వారా బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన డేటా ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఏఎన్ఎంలను ఆదేశించారు. 104 అంబులెన్స్ వాహనం ద్వారా మెరుగైన చికిత్స అందించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్‌రఘువాన్షి, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, డీఐఓ శాంతకుమారి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి పాల్గొన్నారు.



తనపల్లి విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలపై ఆరా తీస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

కమిటీల్లో మునగంగ!

తిరుపతి గంగ జాతర కోసం ముచ్చటగా మూడో కమిటీ

- అంతకుముందు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కలిసి ఓ కమిటీ ఏర్పాటు
- తాతయ్యగుంట గంగ జాతరలో మితిమీరిన రాజకీయ జోక్యం
- కమిటీలు కూడా ఏర్పాటు చేయలేని వారు జాతర ఎలా జరుపుతారో?

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరలో కూటమి నేతలు రోజుకొక రాజకీయ వేషాలు వేస్తున్నారు. పాలక మండలి లేకపోవడంతో గంగమ్మ ఆలయంలో పెత్తనం చెలాయించేందుకు పోటీపడుతున్నారు. అందుకోసం ఉత్సవ కమిటీలో చోటు కోసం ఎవరికి వారు బరిలోకి దిగుతున్నారు. ఈ క్రమంలోనే కలెక్టర్ ముచ్చటగా మూడో కమిటీని విడుదల చేశారు. అందులో ఐదు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ప్రకటించిన జాబితానే పక్కన పెట్టించి.. సోమవారమే రెండు పర్యాయాలు కొత్తగా జాబితా విడుదల చేయించడం గమనార్హం.

తెలుగు రాష్ట్రాల్లో తిరుపతి తాతయ్య గుంట గంగ జాతర ఎంతో ప్రత్యేకమైనది. ప్రతి ఏటా మేలో ఈ జాతర వైభవంగా నిర్వహిస్తుంటారు. తొమ్మిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన తాతయ్య గుంట గంగ జాతరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. రాష్ట్ర పండుగగా ప్రకటించి తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో గంగ జాతర నిర్వహించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సారిగా నిర్వహిస్తున్న గంగ జాతర విశిష్టతను మంటగలిపేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

రోజుకో కమిటీ

తాతయ్య గుంట గంగ జాతర మంగళవారం చాటింపుతో ప్రారంభమైంది. ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ జాతర ప్రత్యేకత వేషాలే. అయితే ఈ ఏట నిర్వహించే గంగ జాతర వేషాలకంటే.. కూటమి నేతల రాజకీయ వేషాల పైనే చర్చనడుస్తోంది. గంగ జాతర నిర్వహణ కోసం అంటూ స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మరి కొందరు కూటమి నేతలతో కలిసి 27 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీకి దేవదాయశాఖ గుర్తింపు కోసం ఎమ్మెల్యే సిఫారసు లేఖను కమిషనర్‌కు పంపించారు. అయితే ఆ జాబితా ఏకపక్షంగా ఉండడంతో సిఫారసు లేఖను కమిషనర్ పక్కన పెట్టేశారు. అంతకుముందే కలెక్టర్ వెంకటేశ్వర్లు మే 2న 15 మందితో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీలో కేవలం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, బోర్డు మెంబర్లు, కార్పొరేషన్ చైర్మన్లు మాత్రమే ఉండడంతో కూటమి శ్రేణులకు ఆగ్రహం తెప్పించనట్లుంది.

జాతర కంటే.. కూటమి నేతల గోలే ఎక్కువ

జాతర చాటింపు వేసి ఉత్సవాలు నిర్వహించాల్సిన సమయంలో కమిటీల గోల రాజధానికి చేరింది. జాతర నిర్వణను పక్కనబెట్టి కూటమి నేతలు ఎవరికి వారు కమిటీల్లో చోటు కోసం పాకులాడుతుండడంతో అధినేతలకు తలనొప్పిగా మారింది. చేసేది లేక.. ఈ నెల 2న ప్రకటించిన జాబితాను సోమవారం రాత్రికి రాత్రే రద్దుచేసి.. 21 మంది కొత్త కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతటితో ఆగని కూటమి నేతలు మరో ఇద్దరి పేర్లను కొత్తగా చేర్చి 23 మందితో కమిటీని ప్రకటించారు. అంతకుముందు విడుదల చేసిన రెండు కమిటీలను రద్దు చేయించి తమ అనుచరులకు చోటు కోసం మరో కమిటీని నియమించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జాతరలో రాజకీయ వేషాలేంటని మండిపడుతున్నారు. జాతర నిర్వహణపై కంటే.. కమిటీలో చోటుపైనే కూటమి నేతలు శ్రద్ధ చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతరను సజావుగా నిర్వహిస్తారా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మరిచిపోయారా అమాత్యా?

- ఆ యూనివర్సిటీలకు వీసీల నియామకం ఎప్పుడో?
- అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాదైనా మోక్షం కల్పించేనా?
- ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మాటేమిటో?
- యువగళం పాదయాత్ర హామీలు గాలికొదిలేసినట్టేనా?
- మంత్రి లోకేష్ జిల్లా పర్యటన నేపథ్యంలో విద్యార్థి సంఘాల ప్రశ్నాస్త్రాలు

'నిరుద్యోగులకు మాటిస్తున్నా.. ఉద్యోగాలు రాకుంటే ప్రతి నెలా రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తాం. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున పంపిణీ చేస్తాం. క్రమంతప్పకుండా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తాం. యూనివర్సిటీల పాలన గాడిన పెడతాం. శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమిస్తాం. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం. ఉపాధ్యాయులతో చర్చించి సామరస్యంగా సమస్యలు పరిష్కరిస్తాం. రాజకీయాలకు తావులేకుండా సరస్వతీ నిలయాలను తీర్చిదిద్దుతాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులకు బాటలు వేస్తాం. స్కాలర్‌షిప్‌లతో పేద విద్యార్థులకు అండగా నిలుస్తాం..' అంటూ గత ఎన్నికల్లో చేపట్టిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీల వర్షం గుప్పించారు. అందులో తడిసిముద్దయిన జనం కూటమి ప్రభుత్వానికి పట్టం గట్టింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నాయకులు వాటన్నింటినీ మరిచిపోయారు. తిరుపతి లాంటి మహానగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా లేకుండాపోయింది. ఎస్వీయూ, వెటర్నరీ వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీల నియామకం చేపట్టకపోవడం, శాశ్వత అధ్యాపక పోస్టులకు గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు వసూళ్లకు సంకెళ్లు వేయకపోవడం తల్లిదండ్రులను బాధిస్తోంది. జిల్లాలో రెండు రోజుల పాటు రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని విద్యార్థి లోకం అభ్యర్థిస్తోంది. యువగళం హామీలు అమలు చేయాలని ప్రశ్నాస్త్రాలు సంధిస్తోంది.

– తిరుపతి సిటీ

వర్సిటీల్లో పాలన అస్తవ్యస్తం



ఎస్వీయూ, వెటర్నరీ వంటి ప్రధాన వర్సిటీలకు ఏడాది గడుస్తున్నా పూర్తి స్థాయి వీసీల నియామకం చేపట్ట లేదు. ఇబ్బడి ముబ్బడిగా అంతర్గత బదిలీలు, తాత్కాలిక ఉద్యోగులను తొలగిస్తూ రోడ్డు పాలు చేశారు. దీంతో పాటు అవినీతి రాజ్యమేలుతోంది. ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియడం లేదు. ఉద్యోగులకు గత ఏడాదికి ఒక్క నెల కూడా నెల ప్రారంభంలో వేతనాలు పడిన దాఖలాలు లేవు. ఇప్పటికై ప్రభుత్వం మేల్కొని పాలనను గాడిలో పెట్టాలి.

–జంగంరెడ్డి కిషోర్‌దాస్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ఉన్నత విద్య మిథ్యేనా?



తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం దారుణం. జిల్లాలోని గ్రామీణ పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. మరికొంత మంది అప్పు చేసి కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. పలు మార్లు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. టీటీడీ విద్యాసంస్థలు ఉన్నా గ్రామీణ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ప్రవేశాలు దొరకడం లేదు.

–హేమాద్రి యాదవ్, స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి జిల్లా

నిలువు దోపిడీ



జిల్లాలో విద్యాహక్కు చట్టం నిర్వీర్యమైంది. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల తల్లి దండ్రులను మభ్య పెట్టి అప్పుల పాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలపై నియంత్రణ లేకపోవడం దారుణం. జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25శాతం ఉచిత ప్రవేశాలు చేపట్టలేదు. అంతా వ్యాపారమే.

–భగత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

రాజకీయ వేదికలుగా సర్వతీ నిలయాలు



సరస్వతీ నిలయాలు రాజకీయ వేదికలుగా మారుతున్నాయి. అధికారులు రాజకీయ నాయకులకు వత్తాసుపలుకుతూ వారు చెప్పిందే వేదంగా పాలన సాగిస్తున్నారు. ఇది వర్సిటీల మనుగడకు ప్రమాదకరం. విద్యాసంస్థల్లో పొలిటికల్ లీడర్స్ బ్యానర్లు, జన్మదిన వేడుకలు జరపకుండా అడ్డుకట్టవేయాలి. వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీల నియామకం జరగడం లేదు. పీహెచ్‌డీలు చేసిన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు లేక రోడ్డున తిరుగుతున్నారు.

– కామిరెడ్డి తరుణ్, ఏబీవీపీ రాష్ట్ర వర్సిటీల కోకన్వీనర్, తిరుపతి జిల్లా

బకాయిలెప్పుడు లోకేషన్నా?



పేద విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం అందిస్తుందన్న ఆశతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గత ఏడాదిగా కాలంగా బకాయిలు విడుదల చేయలేదు. ఈ ఏడాది నుంచి అయినా క్రమంతప్పకుండా ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించి తీరాలి. యువగళం పాదయాత్రలో కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసే ఆయా వర్సిటీలకే పీజీసెట్ నిర్వహణను అప్పగిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. కానీ అమలుకు నోచుకోలేదు.

– చంద్రనాయక్, ఏఐఎస్ఎఫ్ ఎస్వీయూ కార్యదర్శి, తిరుపతి

జాబ్ క్యాలెండర్ లేదు



గత ఏడాదిగా రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం భర్తీ చేయలేదు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మాటే మరిచారు. ఏడాది తర్వాత మెగా డీఎస్సీ పేరుతో మెలికలు పెట్టి నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు పడుతున్న అవస్థ వర్ణనాతీతం. నిరుద్యోగ భృతి రూ.3 వేలు గాలికి వదిలేశారు. జాబ్ క్యాలెండర్, తల్లికి వందనం ఎటువెళ్లాయో అర్థంకాని పరిస్థితి.

–జే.మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఎస్‌యూఐ

శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు



శ్రీవారిమెట్టు మార్గంలో టోకన్ల జారీపై అధికారులతో మాట్లాడుతున్న ఈఓ శ్యామలరావు

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. శ్రీవారి మెట్టు కాలినడక మార్గంలో ఆటోవాలాల దందా, టోకన్ల జారీలో జరుగుతున్న అవకతకవలపై 'సాక్షి' లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై టీటీడీ స్పందించింది. టీటీడీ అదనపు వెంకయ్యచౌదరి, జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి ఈఓ మంగళవారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ శ్రీవారి మెట్టు మార్గంలో టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుంచి సరైన సహకారం లేనట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను ఆటోవాలాలు స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు, భక్తుల నుంచి విచ్చలవిడిగా చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు శాశ్వత పరిష్కార మార్గం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడాన్ని, టోకన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించి పటిష్ట సౌకర్యాలు కల్పిస్తామన్నారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



కాలినడక మార్గంలో మంచి నీటి కొళాయిని పరిశీలిస్తున్న ఈఓ

క్లుప్తంగా

గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

చిట్టమూరు: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామమైన బురదగల్లికొత్తపాళెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంపీడీఓ మనోహర్‌గౌడ్, ఏపీఓ షీలు కథనం.. గ్రామానికి చెందిన రైతు శేఖర్(45) తోటి కూలీలతో కలిసి గ్రామానికి సమీపంలో ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా కొంత సేపటికి శేఖర్ ఛాతీలో నొప్పిగా ఉందని సహచర కూలీలకు తెలియజేశాడు. ఆపై కొంత సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఎంత సేపటికీ చలనం లేకపోవడంతో మృతిచెందాడని నిర్ధారించుకుని కూలీలు గ్రామానికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

కూల్చేస్తున్నారు సారూ!



కూల్చి వేసిన కట్టడాలు

గూడూరు రూరల్ : పట్టణంలోని సనత్ నగర్ ప్రాంతంలో సర్వే నం.576ఏలోని కట్టడాలను గత నెలలో రెవెన్యూ అధికారులు ఆక్రమణల పేరుతో తొలగించే క్రమంలో కొంత భాగం కూల్చేశారని బాధితులు శ్రీనివాసులు, సుబ్బానాయుడు తెలిపారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. అయినా కొంత మంది వ్యక్తులు మంగళవారం మరో మారు అక్రమంగా తమ స్థలంలోకి ప్రవేశించి జేసీబీలతో మిగిలిన కట్టడాలను కూల్చేందుకు ప్రయత్నించారని తెలిపారు. చివరకు గూడూరు డీఎస్పీ గీతాకుమారి దృష్టికి తీసుకెళ్లడంతో వారిని అడ్డుకున్నారని చెప్పారు.

సెల్ టవర్ ఎక్కి..!



సెల్ టవర్ ఎక్కిన యువకుడు

వాకాడు: పూటుగా మద్యం సేవించిన ఓ యువకుడు మంగళవారం మండల కేంద్రమైన వాకాడులోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పైకెక్కి హల్‌చల్ చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బట్టా చిన్ని మద్యం మత్తులో దాదాపు 130 అడుగుల ఎత్తు ఉన్న సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న వాకాడు పోలీసులు, కోట అగ్నిమాపకశాఖ అధికారులు ఆ యువకుడిని చాకచక్యంగా కిందకి దించి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ యువకుడిని బంధువులకు అప్పజెప్పారు.

రాజకీయ చట్రంలో సత్యవేడు!

- ఎమ్మెల్యే ఒకరు.. పెత్తనం మరికొందరిది
- నాడు విమర్శలు చేసి.. నేడు చేస్తున్నదేమిటో?
- సత్యవేడులో ఆ సామాజికవర్గం వారే పెత్తందారులు
- సస్పెన్షన్‌తో ఎమ్మెల్యేను పక్కనబెట్టిన టీడీపీ అధిష్టానం
- నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్, ఇసుక దోపిడీ
- మంత్రి లోకేష్ పర్యటనలో సత్యవేడు టీడీపీలో లుకలుకలు



వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం నుంచి తమిళనాడుకు గ్రావెల్ తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గం రాజకీయ చట్రంలో చిక్కుకుంది. స్థానిక ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు గురైనప్పటి నుంచి ఆ నలుగురు నేతలు తానే ఎమ్మెల్యేనంటూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఆ నలుగురు కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ప్రత్యేకం. శ్రీసిటీ ఉండడమే అందుకు నిదర్శనం. ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానం. ప్రస్తుతం ఆదిమూలం ఎమ్మెల్యే. ఎన్నికలముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యారు. స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత ఓ మహిళను లైంగికంగా వేధించారని బాధిత మహిళ మీడియా ముందుకొచ్చి చెప్పడంతో ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పెత్తందారుల చేతుల్లోకి సత్యవేడు

ఎమ్మెల్యేని సస్పెండ్ చేయడంతో సత్యవేడు నియోజకవర్గంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన



సత్యవేడు: సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవంలో చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతి బాబు (ఫైల్)

నలుగురు రంగప్రవేశం చేశారు. ఎన్నికల ముందు పరిశీలకుడిగా వచ్చిన చంద్రశేఖర్‌నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్, కో–ఆర్డినేటర్ పేరుతో శ్రీపతిబాబు సత్యవేడులో పెత్తనం చెలాయిస్తున్నారు. గంగాప్రసాద్ మాత్రం తెరవెనుక నుంచి రాజకీయం నడిపిస్తుంటారనే ప్రచారం ఉంది. తాజాగా మంత్రి నారా లోకేష్ పర్యటన ఖరారు కావడంతో మరో కమ్మసామాజిక వర్గానికి చెందిన శాప్ చైర్మన్ రవినాయుడు రంగంలోకి దిగారు. ఆ ముగ్గురే అనుకుంటే.. కొత్తగా మరొకరు వచ్చారంటూ నియోజకవర్గంలో కూటమిలో చర్చనీయాంశంగా మారింది.

దళిత నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సస్పెన్షన్‌ని ఆసరాగా చేసుకుని సత్యవేడులో పెత్తందారి వ్యవస్థకు నాంది పలికింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఏదో ఒక అలజడి సృష్టిస్తూ ఎమ్మెల్యేను సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకవర్గం విమర్శనాస్త్రాలను సంధిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారుల పాలన నడుస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలంతో పాటు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు చేశారు. ఆ ప్రచారాలను తన ఎల్లోమీడియా ద్వారా విషప్రచారం చేయించారు. కూటమి నేతలు అదే వ్యక్తిని టీడీపీలోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే అయ్యాక ఆదిమూలం బండారం బట్టబయలు అయ్యింది. వైఎస్సార్‌సీపీ మంచి నిర్ణయమే తీసుకుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. నేడు సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్నది పూర్తిగా టీడీపీ పెత్తందారుల పెత్తనమే కదా..? అని స్థానికులు అంటున్నారు. అందుకు నిదర్శనమే అక్రమ అనుమతులతో పక్క నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త తన బినామీల ద్వారా పెద్ద ఎత్తున గ్రావెల్, ఇసుక తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేగాక తెర వెనుక ఆయనే పెత్తందారుడిగా వ్యవహరిస్తూ ఆయన చెప్పిన అధికారులనే నియమించుకున్నారు. సీఎం చంద్రబాబు అనుచరుడిగా, వ్యాపారవేత్తగా చలామణి అవుతూ సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారు. ఇలాంటి వారిపై మంత్రి లోకేష్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

తరలిపోతున్న సత్యవేడు సంపద

సార్వత్రిక ఎన్నికల సమయంలో నియోజకవర్గం పరిశీలకుడిగా ప్రవేశించి నేడు సత్యవేడు చంద్రుడుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్న చంద్రశేఖర్ నాయుడు, సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంగాప్రసాద్ అనుచరుడు సత్యవేడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అని చెప్పుకుంటున్న శ్రీపతిబాబు ఎమ్మెల్యే కాకపోయినా ఎమ్మెల్యే హోదాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సంపదగా ఉన్న గ్రావెల్, మట్టి, ఇసుకను తమిళనాడు సరిహద్దులను దాటించి పెద్ద మొత్తంలో లాభార్జన పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమ రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ ఖాతరు చేయడం లేదు.

ట్రాఫిక్ నియంత్రణకు రైల్వే అండర్‌పాస్‌లు



రేణిగుంట వద్ద రైల్వే అండర్‌పాస్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకు రైల్వే అండర్ పాస్ నిర్మాణాలు చేపడుతున్నట్టు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని హీరోహోండా షోరూమ్ ఎదురుగా, శెట్టిపల్లి వద్ద రైల్వే అధికారులు నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్ నిర్మాణాలను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రైల్వే అండర్‌పాస్ నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించి ఎంత ఎత్తు నిర్మిస్తున్నారు, అండర్ పాస్‌లో నిలబడి వరదనీరు బయటకు పంపేందుకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెస్ట్ చర్చ్, ఆర్‌సీరోడ్డు, ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఇక్కడ లేకుండా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఉన్న భూమన అభినయ్‌రెడ్డి అనేక మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించారని గుర్తుచేశారు. అయితే తిరుపతి నగరంలోని రైల్వే మార్గాల్లో గేట్లను పదే పదే వేస్తుండడంతో వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రితో చర్చించి రూ.12 కోట్లతో తిరుపతి–రేణిగుంట రోడ్డులోని హీరోహోండా షోరూం, శెట్టిపల్లి వద్ద రెండు రైల్వే అండర్‌పాస్ నిర్మాణాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

చచ్చేవరకు జగనన్నతోనే



బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : నేను బతికున్నంత కాలం జగనన్నతోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్యే రాజకీయాలకు దూరంగా ఉన్నాడంటూ ప్రచారం చేయడంపై ఆయన గట్టిగానే సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కేసులు నమోదవుతున్న నియోజకవర్గంలో శ్రీకాళహస్తిని చెప్పుకోవాలని తెలిపారు. జనసేన, టీడీపీ కొట్టుకుని ఒకరి ఫ్లెక్సీలు ఒకరు చింపుకుంటుంటే దాన్ని వీడియో తీసిన విలేకరిపైన, అతనిని ఇంటికాడ వదిలేసి వస్తున్న మరో విలేకరిపైన అమానుషంగా దాడులు చేయడం దారుణమన్నారు. రాయలసీమలో కొన్ని ఏరియాల్లో మాత్రమే జరిగే గొడవలను శ్రీకాళహస్తికి తెచ్చేశారన్నారు. పచ్చగా పండిన పైర్లను దున్నేస్తున్నారని, ఇంటి నిర్మాణం కోసం తెచ్చిపెట్టుకున్న విలువైన కలపను తగలబెట్టేస్తున్నారని, అంతా హిట్లర్ పాలన తలపిస్తోందని ధ్వజమెత్తారు. టీడీపీకి సంబంధించిన ఏదో ఒక సోషల్ మీడియాలో ఏదో ఒకటి ప్రచారం చేస్తే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి మొదటి అడుగు వేసే నాటికి తాము ఆయన వెనకాల ఉన్నామని, ఆయన పేరుతో జగన్ చారిటబుల్ ట్రస్ట్ పెట్టి సేవ చేశానని పేర్కొన్నారు. 'నా ప్రాణం ఉన్నంతవరకు జగనన్నతోనే నా ప్రయాణం ఉంటుంది' అని స్పష్టం చేశారు. జగనన్న కోసమే బెంగళూరులో వ్యాపారాలు వదులుకొని శ్రీకాళహస్తి వచ్చినట్టు తెలిపారు. కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడం మానేసి కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో మీడియా సోదరులు కూడా స్వతంత్రంగా వార్తలు రాయలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి అరాచకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా ఆక్రమణ

ప్రభుత్వ నిధులతో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమదారులకు సహరిస్తున్న అధికారులు
- అధికారులపై విరుచుకుపడుతున్న స్థానికులు



ప్రభుత్వ భూమిలో నిర్మించిన గోకులం షెడ్డు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చనేతలు చంద్రగిరి నియోజకవర్గంలో చెలరేగిపోతున్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని కబ్జాల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. ఖాళీ జాగా కనబడితే చాలు అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఆపై వాటికి ప్రభుత్వ నిధులు మంజూరు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. ఇలాంటిదే ఎర్రావారిపాళెంమండలంలో వివాదాస్పందంగా మారింది.

అసలేం జరిగిందంటే

ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయాలపెంట గ్రా



ప్రభుత్వ భూమి అని ఏర్పాటు చేసిన బోర్డు

మ క్రాస్‌లో గ్రామ రెవెన్యూ లెక్కదాఖల సర్వే నం.191లో దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డులు కూడా పెట్టారు. ఈ భూమిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు ప్రయత్నించడంతో అప్పుడు టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమి, గుట్ట ప్రాంతంలో భవనాలు ఎలా నిర్మిస్తారని గగ్గోలు పెట్టారు. అక్కడ రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేసేందుకు ప్రయత్నించినా అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో రైతు భరోసా భవనానికి శాశ్వత భవనం లేకుండా పోయింది.

అధికార అండతో అక్రమ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ప్రభుత్వ భవనాలు నిర్మించకూడదనే స్థలంలోనే అధికార పార్టీ నేతలు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలకు పూనుకున్నారు. ప్రభుత్వం రైతుల కోసం గోకులం షెడ్లు మంజూరు చేయగా.. సదరు స్థలంలో దర్జాగా గోకులం షెడ్డును నిర్మించారు. గోకులం షెడ్ కాకుండా ఇతర నేతలు సైతం భూమిని ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన గోకులం షెడ్‌కు ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇవ్వడం, ఆ షెడ్డుకు ఉపాధి నిధులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై సాక్షత్తూ మండల మీట్లో ప్రజాప్రతినిధులను ప్రశ్నించినా అధికారులు చూస్తాం.. సర్వే చేస్తామంటూ కాలయాపన చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

> **“ నివేదికలు వచ్చిన తర్వాత చర్యలు**
>
> ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయాల పెంట గ్రామ శివార్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల విషయం మా దృష్టికి వచ్చింది. వీఆర్వో, ఆర్ఐ, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే చేయిస్తాం. వారు నివేదిక ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.
>
> – పరమేశ్వరస్వామి, తహసీల్దార్, ఎర్రావారిపాళెం మండలం
>
> **మా దృష్టికి రాలేదు**
>
> ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికారయాల పెంట గ్రామ శివార్లలోని ప్రభుత్వ భూమిలో గోకులం షెడ్ నిర్మించిన విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే బిల్లులు చర్యలు తీసుకుంటాం. బిల్లులు మంజూరు చేయకుండా అడ్డుకుంటాం.
>
> – మహేష్, ఏపీఓ

ఐదు సెంటర్లలో నేడు ఐసెట్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలలో ఐసెట్–2025 బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలో గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు ఎస్వీ పెరుమాళ్ ఇంజనీరింగ్, సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జూపార్క్ సమీపంలోని ఐయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో సుమారు 5వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

మస్టర్ల మాయజాలంపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

కలువాయి (సైదాపురం): నియోజకవర్గ పరిధిలోని కలువాయి మండలం, బాలాజీరావుపేటలో జరిగిన ఉపాధి మస్టర్ల మాయాజాలంపై జిల్లా విజిలెన్స్ అధికారి డీ.విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. సాక్షాత్తు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు సొంత గ్రామంలోనే తూతూమంత్రంగా విచారణ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏపీఓ సునీల్, సిబ్బంది శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.



విచారణ అధికారుల సమక్షంలోనే కుర్చుని ఉన్న టీడీపీ అధ్యక్షుడు


అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వాచ్‌మన్ మృతి



మృతి చెందిన మునిశేఖర్ (ఫైల్)

తిరుపతి రూరల్: పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి సోమవారం అర్ధరాత్రి కాలుజారి కింద పడడంతో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. రేణిగుంట మండలం, అన్నసామిపల్లికి చెందిన మునిశేఖర్ (32) 2020 నుంచి గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ 6వ అంతస్తులోని పెంట్ హౌస్‌లో నివాసముంటున్నాడు. మునిశేఖర్ భార్య రోజావతి అక్కడే స్వీపర్‌గా పనిచేస్తుండగా.. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మునిశేఖర్ మద్యం మత్తులో 6వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఆ వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు చికిత్స నిమిత్తం అతన్ని రుయా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు ఇప్పటికే చనిపోవడంతో అతనికి భార్య పిల్లలు తప్ప ఎవ్వరూ లేరు. మృతుని భార్య రోజావతి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



మృతి చెందిన చుక్కలదుప్పి

కోట: దాహార్తి తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడికి తెగబడిన ఘటన మండలంలోని మైక్రోటవర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. కుక్కల భారి నుంచి దుప్పిని గ్రామస్తులు రక్షించారు. ఆపై ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు వచ్చే సమయానికి దుప్పి మృతి చెందడంతో వారికి అప్పగించారు.

మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు

వెంకటగిరి రూరల్: 'మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు' అని శ్రీకళ్యాణరామ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ సర్వజ్ఞ యాచేంద్ర మంగళవారం పేర్కొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, సైదాపురం మండలం, శ్రీకల్యాణ రామ కంపెనీకి కలిచేడు, గోగుల బృందావనం గ్రామాల్లో రెండు మైనింగ్ గనులున్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1920–30 నుంచి నేటి వరకు ఆయా మైకా పరిశ్రమల్లో మైకా, క్వార్ట్జ్ ఫెల్డ్‌ఫర్ క్వారీలను మచ్చలేని రికార్డులతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తమ ఐదో తరం కుటుంబ సభ్యులతో సహా క్వారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్టు పేర్కొన్నారు. తమ కంపెనీలకు సంబంధించి మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దని కోరారు.


ఏపీపీఎస్సీ పరీక్షలకు 300 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ రాత పరీక్షకు 300 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 911 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 611 మంది మాత్రమే వచ్చారని తెలియజేశారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు తాగునీటితోపాటు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

నిద్రలో లేచి.. భవనం పై నుంచి దూకి..!

తిరుపతి క్రైమ్: అపార్ట్మెంట్ పైనుంచి దూకి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం వేకువజామున తిరుపతిలోని బ్యాంకు కాలనీలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు .. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన రమేష్ కుమారుడు నరేంద్రకుమార్ (13) ఏడవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో నరేంద్ర బ్యాంక్ కాలనీలో ఉన్న చిన్నాన్న విశ్వనాథం వద్దకు వచ్చాడు. విశ్వనాథం కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు.ఇంట్లో ఎక్కువ వేడి ఉండడం వల్ల అపార్ట్మెంట్ ఆరో అంతస్తుపై నిద్రించారు. ఏమైందో ఏమోగానీ నరేంద్ర నిద్రలో లేచి పైనుంచి కిందకు దూకాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. విశ్వనాథం కుటుంబ సభ్యులకు ఇది దిగ్భ్రాంతి కలిగించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతికి కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మద్యం మత్తులో హల్‌చల్



మద్యం మత్తులో పడి ఉన్న డ్రైవర్



వాహనం ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మద్యం మత్తులో ఓ డ్రైవర్ చెలరేగిపోయాడు. అతివేగంగా బొలెరో వాహనాన్ని నడిపి అడ్డొచ్చిన వాహనాల్ని ఢీకొట్టాడు. ఈ ఘటన రేణిగుంటలో చోటు చేసుకుంది. వివరాలు.. తిరుపతి వైపు నుంచి మంగళవారం రాత్రి 8.30 గంటలకు బొలెరో వాహనం అతి వేగంగా వచ్చి అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద దంపతులు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఆపై అతివేగంగా వెళ్లి డాక్టర్ జనార్దన్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న సర్కిల్‌లో ఆపి ఉన్న తమిళనాడు బస్సును, కారును ఢీకొని అదే వేగంతో దూసుకెళ్లాడు. స్థానికులు వెంబడించడంతో వేణుగోపాలపురం ఊరి నుంచి వడ్డిమిట్ట మీదుగా అతివేగంగా వెళ్లడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంబడించి రేణిగుంట పారిశ్రామిక వాడలో పట్టుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో నిలబడే పరిస్థితుల్లో కూడా లేకుండా ఉండడంతో పోలీసులకు అప్పగించారు.

పిడుగు పడి తాటి చెట్టు దగ్ధం



సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం, మన్నేముత్తేరి గ్రామంలో మంగళవారం సాయంత్రం తాటి చెట్టుపై పిడుగు పడింది. హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. ఉరుములు, మేరుపులతో పాటు వర్షం రావడంతో స్థానికులు వణికిపోయారు. తీవ్రమైన ఈదురు గాలులతో భయపడి పోయారు.

గాలీవాన బీభత్సం



శ్రీకాళహస్తి పట్టణం నగరి వీధిలో వర్షపు నీరు

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో మంగళవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది.

– తిరుపతి రూరల్/ శ్రీకాళహస్తి